17 వసంతంలోకి

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

వైఎస్ఆర్ కడప / అన్నమయ్య

28 శుక్రవారం, జూన్ 2024 పేజీలు: 08


## ఆస్తికోసం అత్తమామలను చంపిన కోడలు



వీరబల్లి మేజర్ న్యూస్ : అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలంలో గుర్రప్ప గారి పల్లి పంచాయతీలో కొత్త వడ్డేపల్లి లో కళావతి అనే ఆమె తన అత్తమామలైన నాగ సుబ్బన్న (80), నాగమ్మ (70) లను గురువారం ముష్టి చెక్క బెల్లం నూరి బలవంతంగా తాగించి వారి మరణానికి కారణమైంది. స్థానిక ప్రజల సమాచారం మేరకు ఆమె భర్త రమణయ్య ఆరోగ్యం బాగా లేక తాగుడుకు అలవాటు పడి ఇంటిదగ్గర ఖాళీగా ఉండేవాడు ఇదే అవకాశంగా ఆమె గుర్తించి మంచానికే పరిమితమైన అత్తమామలను చంపడానికి ప్రయత్నం చేసినట్లు సమాచారం. భర్తకు ఫుల్లుగా మందు త్రాగించి అతను పూర్తిగా మత్తులోనికి జారుకోగా అదే అదునుగా భావించి మంచానికే పరిమితమైన అత్తమామలకు ముష్టి చెక్క బెల్లము నూరి బలవంతంగా త్రాపింది. ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్కల నివాసం ఉన్నవారు వెంటనే పోలీసులకు స్థానిక విలేకరులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అక్కడ జరిగిన విషయాన్ని ప్రజల ద్వారా అడిగి తెలుసుకోవడం జరిగింది అనంతరం 108 వాహనంలో చికిత్స కోసం వృద్ధులైన భార్యాభర్తలను రాయచోటి ప్రభుత్వ

## జూలై 4న జిల్లాలో సంపూర్ణత అభయాన్ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలి

లక్కిరెడ్డిపల్లె, కోడూరు, కురబలకోట మండలాలలో కార్యక్రమం అమలుకు శ్రీకారం

జిల్లా కలెక్టర్ యం. అభిషిక్త్ కిషోర్




రాయచోటి, మేజర్‌న్యూస్: కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ సంస్థ ఆదేశాల మేరకు జూలై 4న జిల్లాలో సంపూర్ణత అభయాన్ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ యం. అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం క్రింద జిల్లాలో సంపూర్ణత అభయాన్ కార్యక్రమం అమలు, సాధించాల్సిన లక్ష్యాలు, చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై వైద్యఆరోగ్య, మహిళా శిశు సంక్షేమం, వ్యవసాయ, డిఆర్డిఏ, ప్రణాళిక అధికారులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ సంస్థ నిర్దేశించిన ఇండికేటర్లు... ప్రసవానంతర సంరక్షణ కోసం నమోదు చేసుకున్న గర్భిణీ స్త్రీల శాతం, అమలు చేస్తున్న కార్యక్రమాలు, రక్తపోటు, మధుమేహ సంబంధిత వ్యక్తుల స్క్రీనింగ్ శాతం, ఐసిడిఎస్ కార్యక్రమం కింద న్యూట్రిషన్ సప్లిమెంట్ పొందుతున్న

## ప్రయాణికుల సురక్షతే మా ధ్యేయం

నూతన బస్సులను ప్రారంభించిన మంత్రి రాముడు

త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం : గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసింది

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి, మేజర్‌న్యూస్: ప్రయాణికుల సురక్షిత ప్రయాణం కోసం రాబోయే కాలంలో మరిన్ని నూతన బస్సులను ప్రారంభిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా యువ జన క్రీడా శాఖ మంత్రి మండీపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నాడు అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రాయచోటి నుంచి తిరుపతికి నూతన సూపర్ లగ్జరీ బస్సును మంత్రి ప్రారంభించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమీక్షించి మహిళా ఉచిత ప్రయాణాన్ని ప్రారంభిస్తామన్నారు. చిన్న వయసులో క్యాబినెట్ లో చోటు కల్పించడమే కాకుండా కీలక శాఖలు తనకు అప్పగించిన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకి, యువనాయకులు నారా లోకేష్ బాబుకి ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం ఆర్టీసీ ఆస్తులు ఆక్రమించుకొని ఆర్టీసీని నిర్వీర్యం చేసిందన్నారు. రాబోయే కాలంలో ఆర్టీసీని ప్రక్షాళన గావించి ప్రయాణికులకు నాణ్యమైన సేవల అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే కాలంలో మరిన్ని నూతన బస్సులను కొనుగోలు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

### అన్నమయ్య జిల్లా మార్పుపై వస్తున్న వార్తలపై స్పందించిన మంత్రి

అన్నమయ్య జిల్లాను మారుస్తున్నారు అనే వార్తలపై మంత్రి స్పందిస్తూ ఎట్టి పరిస్థితుల్లో జిల్లా మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఊరు పేర్లు, సంస్థల పేర్లు మార్చే ప్రభుత్వం మాది కాదని మాది ప్రజా ప్రభుత్వమని



ప్రజలకు అనుగుణంగా నడుచుకునే ప్రభుత్వము అని పేర్కొన్నారు. రాబోయే కాలంలో రాయచోటిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన రవాణా అధికారి రాము, రాయచోటి డిపో మేనేజర్ ధనుంజయ, ఆర్టీసీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ పక్కాగా నిర్వహించండి

### జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు




కడప, మేజర్‌న్యూస్ : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా పక్కగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి.. ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ పథక పంపిణీ పై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ సంబంధిత కార్యదర్శులతో కలిసి.. అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాటు జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డిఆర్ఓ గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ పెన్షన్ డిస్బర్సుమెంట్ గైడ్లెన్స్ ప్రకారం పెంచిన పింఛన్లను జులై 1 వ తేదీన వాలంటీర్ల వ్యవస్థ తో కాకుండా. సచివాలయ సిబ్బందితోనే పెన్షన్ల పంపిణీ ఇంటి వద్దే అందజేయాలని ఆదేశించారు. ఏవైనా మిగిలిపోయిన పెన్షన్లు ఉంటే జూలై 2 వ తేదీలోపు ఎట్టి పరిస్థితుల్లో అందింజేయాలని అన్నారు. సచివాలయ ఎంప్లాయ్ లాగిన్‌లో 50 మందితో క్లస్టర్ మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులు డెప్యూటేషన్‌లో ఉన్నా, సిబ్బంది తక్కువగా ఉన్న చోట్ల ఇతర ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకోవచ్చునని వీళ్ళకి లాగిన్స్ మండల ప్రజా పరిషత్ లాగిన్ లో ఉంటాయని తెలిపారు.జూలై 29 వ తేదీన తేదీన పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్ పెన్షన్ అమౌంట్ విత్ డ్రా చేసి సంబంధిత సిబ్బందికి అందించాలని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పేరుతో పెన్షన్ అమౌంట్ ను 4000 కి పెంచడంతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గత మూడు నెలలకు (ఏప్రిల్ నెల నుంచి ప్రతి నెల చొప్పున)1000 తో కలిపి జులై నెల 4000 తో సహా

## విద్యావ్యవస్థపై ప్రత్యేక దృష్టి

### ఎమ్మెల్యే మాధవిరెడ్డి



కడప ఐటిఐ సర్కిల్, మేజర్‌న్యూస్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తారని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిరెడ్డి పేర్కొన్నారు. ఈ రోజు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డితో కలిసి నగరంలోని 14వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లో ఉన్న చంద్రమౌళి స్కూల్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో నాడు-నేడు పేరుతో పాఠశాలలకు రంగులు మార్చారే తప్ప విద్యావ్యవస్థలో ఎటువంటి మార్పులు చేయలేదన్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి విద్యావ్యవస్థపై ప్రత్యేక దృష్టితో పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీసీ హాస్టల్స్‌లో పరిశుభ్రతపై అవగాహన



తొండూరు మేజర్ న్యూస్ తొండూరు మండలంలోని బీసీ హాస్టల్స్ లో గురువారం. తొండూరు ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ రేష్మ ఆధ్వర్యం లో తొండూరు బిసి బాలుర హాస్టల్‌లో తన సిబ్బంది తో కలిసి సందర్శించారు. హాస్టల్‌లో స్నానాల గదులు తాగునీటి సౌకర్యము వంట రూములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నిద్రించే గదులన్నీ కిటికీలకు వాటికి కావలసిన మెసులను ఏర్పాటు చేయాలని దీని ద్వారా విద్యార్థులకు దోమల ద్వారా వచ్చే మలేరియా టైఫాయిడ్ వంటి రకాల జ్వరాల నుండి కాపాడవచ్చునని సూచించారు. విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలని ప్రతి విద్యార్థి తన విద్యను అభ్యసిస్తూ పాఠశాల ఆవరణంలో కానీ హాస్టల్ ఆవరణంలో కానీ చెత్తాచెదారాలను వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న నీళ్ల ట్యాంకిలు పరిశీలించి మంచినీటి సరఫరా అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## భవిత చిన్నారులకు దుప్పట్లు పంపిణీ



వేంపల్లె మేజర్ న్యూస్: స్థానిక భవిత దివ్యాంగుల కేంద్రంలోని చిన్నారు లకు దుప్పట్లు పంపిణీ చేశారు. గురువారం ఆ కేంద్రం నందు కడప రూరల్ డెవలప్‌మెంట్, యూత్ వెల్ఫేర్ సమితి ఆధ్వర్యంలో ఎంఇఓ స్టాలిన్ ఐజాక్ చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంఇఓ మాట్లాడుతూ భవిత దివ్యాంగుల కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి ఇలాంటి సేవ కార్యక్రమాలు చేపట్టడం హర్షణీ యమన్నారు. విధ్యార్థులు కూడా బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సేవా సమితి సెక్రటరీ నజీమ్ అహ్మద్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఎంతో మందికి వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. భవిత చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేయడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. మరిన్ని సేవలు అందించేందుకు ఎల్లవేళలా ముందుం టామని వెల్లడించారు. కార్యక్రమంలో భవిత ఐఈఆర్టీలు యశోద, సుజాత, చిన్నారుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాం

– ప్రజలతో ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాటామంతీ



మదనపల్లె,మేజర్ న్యూస్ : పట్టణ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని శాసన సభ్యులు షాజహాన్ బాషా పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఇందిరా నగర్ నందు విస్తృతంగా పర్యటిం చారు.వార్డులో నెల కొన్న సమస్యలను తెలుసుకొనడానికి క్షేత్రస్థాయిలో పర్యటించి వాటి పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి పెట్టారు.అలాగే ప్రజలతో మమేకమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం అధికారులతో మాట్లాడి ముగురు నీటి కాలువలు, పారిశుద్యానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని,మినరల్ వాటర్ ప్లాంట్ ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని,దీర్ఘ కాలంగా అసం పూర్తిగా ఆగిపోయిన షాది మహల్‌ను సందర్శించి,దాని ప్రస్తుత పరిస్థితి,పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపైన ఆరా తీశారు.విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే స్పందిస్తూ తక్షణమే మున్సిపల్ అధికా రులు ఇందిరా నగరులో తిష్ట వేసిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల,సచివాలయం సిబ్బంది,28వ వార్డు ఇంచార్జ్ గౌస్ అజాం,స్థానిక ప్రజలు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్కి సినిమా టికెట్ అధిక రేట్లతో వసూలు చేస్తున్న థియేటర్ యాజమాన్యాలు : డివైఎఫ్ఐ



ప్రొద్దుటూరు మేజర్ న్యూస్ జిల్లాలో ఉన్న అధిక సినిమా టికెట్స్ వసూలు చేస్తున్న సినిమా థియేటర్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి అని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్ రాజ్ స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ కల్కి సినిమా మొదటి రోజు 500 నుండి 1000 వరకు సినీ ప్రేక్షకుల నుండి వసూల్ చేసి దోచు కుంటున్నారు. చాలా సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు త్రాగడానికి మంచి నీరు, మరుగు దొడ్లు ఉండవు, మౌలిక వసతులు ఉండవు. అధిక రేట్లకు తిను బండారాలు, వాహనాలు పార్కింగ్ చేయడానికి ఫీజు వసూలు చేస్తున్నారు. అధికారులు స్పందించి అధిక సినిమా టికెట్స్ వసూలు చేస్తున్న సినిమా థియేటర్స్ యాజమాన్యాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి లేనిపక్షంలో థియేటర్స్ ముందు ధర్నాకు దిగుతామని ప్రభుత్వాన్ని అధికారులను హెచ్చరిస్తున్నాం. సమావేశంలో ప్రదీప్, ఓబులేసు, సురేష్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె మేజర్ న్యూస్: నేడు పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయ నున్నట్లు విద్యుత్ శాఖ జేఈ శివదినేష్ కుమార్ వెల్లడించారు. పట్టణంలోని హెచ్డిఎఫ్సీ బ్యాంక్, గాంధీరోడ్డు, జివిం కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

## హాస్టల్‌లోని 49 మంది విద్యార్థులకు వైద్య ఆరోగ్య పరీక్షలు



ప్రొద్దుటూరు మేజర్ న్యూస్ స్థానిక మండ లంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పొట్టిపాడు రోడ్డులోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర కాలేజీ విద్యార్థులకు వైద్యాధికారి డా.హనీఫ్ బాబా హాస్టల్‌లోని 49 మంది విద్యార్థులకు వైద్య ఆరోగ్య పరీక్షలను చేశారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల శుభ్రత పరిసరాల పరిశుభ్రత గురించి జ్వరాలు రాకుండ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్ఓ క్రిష్ణమ్మ, సూపర్‌వైజర్స్ బి.ఎ. వరప్రసాద్ చంద్రకళ సంక్షేమాధికారి రామకృష్ణారెడ్డి. సిహెచ్ఓ నాగలత ఆరోగ్య కార్యకర్త అరుంధతి ఆషా కార్యకర్తలు రామక్క జ్యోత్స్న పాల్గొన్నారు.

## మిట్స్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం



కురబలకోట,మేజర్ న్యూస్ : మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్ కళాశాల) నందు కంటి పరీక్షల ను నిర్వహించారు.ఈ కార్యక్రమం మదనపల్లెలోని డాక్టర్ అగ్రవాల్ కంటి వైద్య హాస్పిటల్ సిబంది వారు కళాశాలలోని అధ్యాపకులకు విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించారని కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ఏపని చేయాలన్నా మన కళ్ళ ఆరోగ్యంగా ఉండాలి. కంప్యూటర్ల ముందు గంటల కొద్దీ కూర్చుని ఉద్యోగాలు చేసే వారికే కంటి సమస్యలు వస్తుంటాయని చాలామంది భావిస్తారు. అయితే కాలుష్యం,ఆహారపు అల వాట్లు, ఇతర అనారోగ్యాలు కూడా కంటి ఆరోగ్యంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతాయన్నారు. అయితే పరీక్షల ద్వారా ముందుగానే వీటిని గుర్తిస్తే చెక్ పెట్టే అవకాశం ఉంటుందని,అందుకే ఆరోగ్యవంతమైన కళ్ల కోసం రెగ్యులర్ చెకప్ అవసరమన్నారు. పాలకూర, డ్రై ఫ్రూట్స్, నారింజ, చిలగడదుంప, పొద్దుతిరుగుడు విత్తనాలు, క్యారెట్ రసం వంటి ఆహారాల ద్వారా మన కంటికి సంబంధించిన అనేక రకాల వ్యాధులను నయం చేయడంలో సహాయపడు తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తులసీరామ్ నాయుడు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు సంస్థలో ఘనంగా హెలెన్ కెల్లర్స్ డే



మదనపల్లె, మేజర్ న్యూస్ : పట్టణంలోని అమ్మచెరువు మిట్టనందు గల వెలుగు సంస్థలో గురువారం హెలెన్ కెల్లర్ డేని ఘనంగా జరుపు కున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మీ, ప్రిన్సిపాల్ లీనాకుమారి హాజరయ్యారు.ముందుగా వెలుగు సిబ్బంది స్వీటీ గారు మాట్లాడుతూ డీఈఆర్ఎస్ నేషనల్ ట్రస్ట్ ఆదేశాల మేరకు హెలెన్ కెల్లర్స్ డేను ఈ రోజు మన వెలుగు సంస్థలో హెలెన్ కెల్లర్ డే నిర్వహించామని, ఆమె జ్ఞాపకార్థంగా మన భారత దేశంలో ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగును నిర్మించడం జరిగిందనీ,హాస్పిటల్స్ మరియు వీధుల పేర్లను హెలెన్ కెల్లర్ పేరు మీదుగా పెట్టడం జరిగిందనీ ఆమె పేరు మీద యునైటెడ్ స్టేట్స్ పోస్టల్ సర్వీసెస్ ఒక స్టాంప్ కూడా జారీ చేశారని తెలిపారు. దివ్యాంగుడైన పండు అనే విద్యార్థి మాట్లాడుతూ హెలెన్ కెల్లర్ చిన్నతనంలోనే చూపును కోల్పోవడం వలన అన్నే సులెవన్ అనే యువ ఉపాధ్యాయురాలు చేరదీసి టచ్ టీచింగ్ మెళకువలను ఉపయోగించి ఆమెను నైపుణ్యం గల మార్గదర్శకత్వం వైపు నడిపించిందన్నారు.అనంతరం వెలుగు ప్రిన్సిపాల్ లీనా కుమారి,సిబ్బంది విజయ కుమారి మాట్లాడుతూ హెలెన్ కెల్లర్ బాల్యం గురించి ఆమె యొక్క గొప్పతనం గురించి ఎంతో చక్కగా వివరించారు. మనకు చూపు లేకపోతే నడవలేమనీ, ఎటువంటి పనులు చేసుకోలేమనీ, అలాంటిది ఆమె చూపును,వినికిడి,మాటలను కోల్పోయిన కూడా తన ఆత్మ ధైర్యాన్ని కోల్పోకుండా ఇలాంటి వికలత్వం కల్గిన ప్రతి ఒక్కరికి మార్గదర్శకురాలుగా మారిందనీ, ఈమెను మనమందరం స్ఫూర్తి దాయకంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది,పిల్లలు పాల్గొన్నారు

## భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ ఏర్పాటు



వేంపల్లె మేజర్ న్యూస్: భవన నిర్మాణ కార్మిక సంఘం వేంపల్లె నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి లింగన్న ఆధ్వర్యంలో గురువారం స్థానిక జీటీ ఫంక్షన్ హాలులో ఈ నూతన కమిటీ ఏర్పాటు చేశారు. నూతన కమిటీ అధ్యక్షుడు ఎస్. దస్తగిరి, ప్రధాన కార్యదర్శి చల్లా బాలాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ జమాల్ బాషా, కోశాధికారి రమేష్ బాబు, బుజ్జి బాబు, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, ఆంజనేయులు, దేవరాజు, నాగ మల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి ఎంపిక పట్ల కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సంఘం బలోపేతానికి కృషి చేద్దామని, అలాగే ప్రభుత్వ పరంగా రావాల్సిన సంక్షేమ పథకాలను అమలు చేయడంలో తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఇతరత్రా సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేద్దామన్నారు.

## ఇద్దరు పెళ్లాల ముద్దుల మొగుడిలా ఉంది

### డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి



వేంపల్లె మేజర్ న్యూస్: ఇద్దరు పెళ్లాల ముద్దుల మొగుడిలా కేంద్రంలోని బిజెపి..టిడిపి, వైకాపాల వ్యవహార శైలి ఉందని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి, టిడిపి, జనసేన పార్టీలు కలిసి వైకాపాతో తీవ్రంగా తలపడ్డాయని, తీవ్ర స్థాయిలో విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకున్నాయన్నారు. బుధవారం లోక్‌సభ స్పీకర్ ఎన్నిక సందర్భంగా బిజెపి, టిడిపి, వైకాపా కలిసిపోయాయి అన్నారు. రాష్ట్రంలో కుస్తీ, హస్తినలో దోస్తీ అన్న విధంగా ఉందన్నారు. టిడిపి, వైకాపా, జనసేనకు రాష్ట్ర ప్రయోజనాలు పట్టవని ధ్వజ మెత్తా రు. విభజన హామీలు విస్మరించిన బిజెపికి మద్దతు తెలపడం శోచనీయమన్నారు.

# పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చొరవ చూపండి

**– ఎమ్మెల్యేకి టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల వినతి**



మదనపల్లె,మేజర్ న్యూస్ : మదనపల్లి పట్టణ ట్రాఫిక్ సమస్యను శాశ్వ తంగా పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు మదనపల్లి టౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతి రావు, కమిటీ సభ్యులు కలసి వినతిపత్రం అందజేశారు.గురువారం ఎమ్మెల్యే నివాసంలో అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేని కలసి మదనపల్లిలో దీర్ఘకాలంగా ఉన్న ట్రాఫిక్ సమస్యను వారి దృష్టికి తీసుకొచ్చారు.ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కారం చేయాలని కోరుతు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తు అధికారులతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగిందని తిరుపతి రావు తెలిపారు.గత పది సంవత్సరాలుగా అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ట్రాఫిక్ సమస్యపైన పోరాటం సాగిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు మరియు అనధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని కూడా విన్నవించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వై.ఎస్.మునిరత్నం, డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి,రెడ్డెప్ప రెడ్డి, రాజారెడ్డి, శకుంతలమ్మ, ఎం.ఆర్. రాజేశ్వరి, నాగభూషణం, మురళి, వెంకటరమణ పాల్గొన్నారు.

# ముక్తియార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు



ప్రొద్దుటూరు మేజర్ న్యూస్ స్థానిక తెలుగు దేశంపార్టీ రాష్ట్ర కార్య నిర్వా హక కార్యదర్శి, ముక్తియార్ విద్యాసంస్థల ఛైర్మన్, మాజీ మునిసిపల్ ఛైర్మన్, వి.యస్. ముక్తియార్ 64వ జన్మదినం సందర్భంగా ఆయన స్వగృహం నందు పుష్పగుచ్ఛం అందించి, ఆయన నిండునూరేళ్ళు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ, తెలుగుదేశంపార్టీకి మరిన్ని విజయాలు అందించాలని పట్టణ నంద మూరి యువసేవాసమితి ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్య క్రమంలో నందమూరి యువసేవాసమితి అధ్యక్షుడు గోమేధికమ్ సుదర్శన్, ఉపాధ్యక్షుడు సిజె.వెంకటసుబ్బయ్య కడప పార్లమెంటరీ తెలుగుదేశంపార్టీ కార్యదర్శి సి.సిద్ధయ్య, కడప పార్లమెంటరీ తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి కూనపురి రామునాయుడు, కడప పార్లమెంటరీ బిసి సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి పి.ఎస్.సుబ్బరాజు, నంద మూరి యువసేవాసమితి కార్యదర్శులు డా.మచ్చా నాగభూషణం (అఖండ), జి.విమల్, ఎస్.రసూల్, సిజె.సమర పాల్గొన్నారు.

# ఎన్నికల నిధుల స్వాహాపై విచారణ జరపాలి

**యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ డిమాండ్**




బద్వేలు మేజర్ న్యూస్: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో బద్వేల్ నియోజక వర్గంలో అధికారులు దాదాపు కోటి రూపాయల నిధులను స్వాహా చేసినట్లు ఆరోపణలు వెల్లివిరుస్తున్నాయని, ఈ ఆరోపణలపై జిల్లా కలెక్టర్ తక్షణమే విచారణ జరిపించాలని యుటిఎఫ్ కడప జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఉదయం బద్వేలులోని స్థానిక ఎంఇఓ కార్యాలయం వద్ద బిగ్ టీవీ ప్రతినిధితో మాట్లాడారు. ఈ సందర్భంగా మాదన విజయకుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు బద్వేల్ నియో జకవర్గ పరిధిలోని ఏడు మండలాలకు కోటి 80 లక్షల రూపాయల నిధులను రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిందని, వీటిని ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రిని కొనుగోలు చేయడంతో పాటు, ఎన్నికలు నిర్వహించిన సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లించాల్సి ఉందన్నారు ఎన్నికల విధులు నిర్వహించిన ఉద్యోగులకు సక్రమంగా రెమ్యునరేషన్ చెల్లించలేదని ఆయన ఆరోపించారు. ఎన్నికల నిధులకు ఆడిట్ లేకపోవడం మూలాన నిధులలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నయన్నారు. ఈ అక్రమాలపై కలెక్టర్ తక్షణ విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవానందం, కె.సుధాకర్ పాల్గొన్నారు.

# కూరగాయల మార్కెట్‌ను జగన్ ఏపేరుతో ప్రారంభించారు?

పులివెందుల అర్బన్ మేజర్ న్యూస్ నాడు కూరగాయల మార్కెట్ కు శ్రీ రంగనాథ స్వామి పేరును తొలగించి వైయస్సార్ కూరగాయల మార్కెట్‌గా పేరు మార్చడం వైసీపీ నాయకుల అభిప్రాయమా?లేక ప్రజల అభిప్రాయమా? ప్రజల అభిప్రాయం అయితే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందులకు మార్కెట్ యార్డు ప్రారంభోత్సవం చేసేటప్పుడు అప్పటి మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి, చైర్మన్ వరప్రసాద్, నాయకుల ఫోటోలు పెట్టి కార్యకర్తలు రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్ పేరుతో ప్రారంభోత్సవానికి స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఎందుకు వేశారు అని హిందూ సంఘ నాయకులు ప్రశ్నిస్తున్నారు. సొంత పార్టీ కార్యకర్తల అభిప్రాయాన్ని వైసిపి నాయకులు పరిగణలోకి తీసుకోలేకపోవడం, ప్రజలు, వ్యాపారస్తులు అభిప్రాయం మేరకు కూరగాయల మార్కెట్ కు పేరు మార్చామనడం హాస్యాస్పదం అని వారంటు న్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కౌన్సిల్లోని పెద్దలు ప్రజల మనోభావాలను గుర్తించి కూరగాయల మార్కెట్ కు శ్రీ రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్ గా కౌన్సిల్లో ఆమోదం తెలిపి గెజిట్లో చేర్చాలని వారు తెలిపారు. మేము మారం నాధోరణి ఇంతే అంటే ఒకటి గుర్తుపెట్టుకోండి ఈ సృష్టిలో ఏప్పటికైనా భగవంతుడు ధర్మమే శాశ్వతం వ్యక్తులు అధికారం కాదు అహంకార ధోరణితో ప్రవర్తిస్తే ప్రతి ప్రశ్నకు కాలమే సమాధానం చెబుతుంది అని అంత పైవాడు చూస్తుంటాడని వారన్నారు. అధికారుల, నాయకుల ఫోటోలు పెట్టి రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్ అని ఫ్లెక్సీలో వేసినప్పుడు ఇది ఎందుకు వేశారు అని ఆరోజు ఎందుకు ప్రశ్నించలేదని వారు అంటున్నారు. స్వయానా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్‌నే ప్రారంభించారే తప్ప వైయస్సార్ కూరగాయల మార్కెట్ అని ఎక్కడ ప్రారంభించారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఈ ఫ్లెక్సీ ఆధారంగా తీసుకొని కూరగాయల మార్కెట్ కు రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్ అని పేరు పెడితే అందరూ సంతోషిస్తారని వారన్నారు.

# ఉద్యోగ,ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను చెల్లించాలి



బద్వేలు మేజర్ న్యూస్: గత ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పిఎఫ్,ఏపీ జి ఎల్ ఐ, సరెండర్‌లకు సంబంధించిన అన్ని రకాల బకాయిలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని డెమొక్రటిక్ పిఆర్‌టియు వైయస్సార్ జిల్లా అధ్యక్షులు మానుగుంట రవిశంకర్ ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు. గురువారం డెమొక్రటిక్ పిఆర్‌టియు ప్రాంతీయ కార్యాలయంలో రవిశంకర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలన్నింటిని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని త్వరలో ప్రభుత్వం ఇవ్వ బోయే తల్లికి వందనమును కేవలం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని తెలిపారు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయేందుకు తల్లికి వందనం ప్రైవేట్ పాఠశాలలు కూడా ఇస్తామని చెప్పడమేనని తెలిపారు ఈ విద్యా సంవత్సరంలోనే 117 జీవోను రద్దు చేసి ఉన్నత పాఠశాలలో విలీనం అయిన 3,4,5 తరగతులను వెంటనే ప్రాథమిక పాఠశాలలకు తిరిగి పంపేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

# అధిక ఫీజు వసూళ్లను ఆపాలి : ఎస్ఎఫ్ఐ



జమ్మలమడుగు మేజర్ న్యూస్ జమ్మలమడుగు పట్టణంలోని కొన్ని ప్రముఖ ప్రైవేట్ పాఠశాలలు అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ- డివైఎఫ్ఐ బాధ్యులు వినయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు స్థానిక జూనియర్ కళాశాలలో మాట్లాడుతూ కొన్ని ప్రముఖ ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులలో వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఫీజులు కట్టాలని వేధించడం జరుగుతుది. ప్రవేట్ స్కూల్‌లకు రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నటు వంటి పేద విద్యార్థులకు బడుగు బలహీన వర్గాలకు 25శాతం ఫీజును తగ్గించుకోవాలని చెబుతున్న ఎక్కడే గాని అమలు కాలేదని చెప్తున్నారు. పక్క రాష్ట్రంలోని తెలంగాణలో జర్నలిస్టుల పిల్లలకి ప్రవేటు పాఠశాలల్లో 50శాతం ఫీజు రాయితీ ఇస్తున్నారు. మన ఈ రాష్ట్రంలో కూడా జర్నలిస్టుల పిల్లలకి కూడా కొంతమటుకు రాయితీ ఇవ్వాలని తెలిపారు. గ్రామాలలో పట్టణాలలో కూలి పనులు వ్యవసాయం చేసుకొని తల్లిదండ్రులు వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవాలని చూస్తున్నారు. కానీ ప్రైవేటు పాఠశాలలు సంతలో కూరగాయల ధరల మాదిరిగా ఫీజుల రూపంలో వ్యాపారం చేస్తున్నారు. జిల్లా ఉన్నత అధికారులు ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రఘురాముడు, హేమంత్, వినోద్, ఇర్షద్, కుమార్ పాల్గొన్నారు.

# వైసీపీకి జడ్పీటిసి గుడ్‌బై



కలికిరి మేజర్ న్యూస్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కలికిరి మండల జడ్పీటిసి సభ్యురాలు కాకర్ల పద్మజ లోకవర్ధన్ గురువారం రాజీనామా చేసినట్లు మీడియాకు తెలిపారు. తన రాజీనామా లేఖను అధిష్టానానికి పంపుతున్నట్లు ఆమె వివరించారు. తన వ్యక్తిగత కారణాలవల్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ఆమె తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



నిమ్మనపల్లె మేజర్ న్యూస్: నిమ్మనపల్లె మండలంలో బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగి ఓ వ్యక్తి తీవ్రంగా గాయ పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బుచ్చిరెడ్డి గారిపల్లెకి చెందిన రైతు రాజశేఖర్ రెడ్డి(46) సొంత పనిమీద నిమ్మనపల్లెకు బైకులో వెళ్ళాడు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా, మార్గ మధ్యంలోని తవళం వద్ద బైకు అదుపు తప్పి పడి తీవ్రంగా గాయ పడ్డాడు. కుటుంబీకులు బాధితున్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# నకిలీ చెవిటి సర్టిఫికెట్లను అరికట్టలేరా?!

పోరుమామిళ్ల మేజర్ న్యూస్ పోరుమామిళ్ల మండలంలో వృద్ధాప్య, అభయ హస్తం, చేనేత, వితంతువులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, జాలర్లు ,వికలాంగులు మరియు తదితర పింఛన్ల కొరకు ప్రభుత్వం దాదాపు రెండు కోట్ల 42 లక్షల రూపాయలు పంపిణీ చేస్తుంది .వీటిలో దాదాపు 1380 వికలాంగ పింఛన్లు ఉన్నాయి. వీటి కొరకు 42 లక్షల రూపాయలు ప్రభుత్వము పంపిణీ చేస్తుంది. కానీ వీటిలో దాదాపు చెవిటి పింఛన్లు ఎక్కువ శాతం ఉన్నట్లు సమాచారం. అందులోనూ నకిలీ చెవిటి పింఛన్లు పొందేవారు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. చెవుడు అనేది కంటికి కనిపించని వైకల్యం కావున చెవుడు లేకున్నా ఉన్నట్లు డాక్టర్ల వద్ద చాలామంది నకిలీ ధ్రువపత్రాలు పొంది పెన్షన్ను చాలా సులువుగా పొందుతున్నారు. చెవిటి నకిలీ ధ్రువపత్రాలు ఎలా పొందుతున్నారంటే ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో వివిధ రకాల వికలాంగుల కొరకు సదరం స్లాట్ ను ఆన్లైన్లో పెట్టడం జరుగుతుంది. ఫలానా తేదీ ఫలానా ఆసుపత్రి అని ఆ సదరం స్లాట్ లో బుక్ చేయడం జరుగుతుంది. అనంతరం స్లాట్ లో బుక్ చేసుకున్న వారిని డాక్టర్లు పరిశీలించి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంది. కడప జిల్లాలో రిమ్స్ ఆసుపత్రి ద్వారానే వికలాంగుల సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుంది. సచివాలయఉద్యోగుల ద్వారా మరియు డాక్టర్లకు అతి సన్నిహితంగా ఉండే వారితో సంప్రదింపులు జరిపి చెవిటి నకిలీ ధ్రువపత్రం కొరకు 20వేల నుండి 30 వేల వరకు ఇచ్చి సర్టిఫికెట్లు పొందడం జరుగుతుందని సమాచారం. అర్హులకు మాత్రం సర్టిఫికెట్ రావాలంటే సంవత్సరాలు తరబడి తిరిగినను వారికి సర్టిఫికెట్ ఇచ్చే పరిస్థితి కనబడడం లేదంటున్నారు. డబ్బులు ఎంత ఎక్కువ ఇస్తే డాక్టర్లు ఎక్కువ శాతం వైకల్యం ఉన్నట్లు ధ్రువపత్రం ఇవ్వడం జరుగుతుందని లేని రోగాన్ని సృష్టించి ధనవంతులు డబ్బులు ఖర్చు పెట్టి నకిలీ పత్రాలు పొందుతున్నారని సమాచారం. కడప జిల్లాలో 2024 మేలో దాదాపు 40 వేల పైగా వికలత్వ పింఛన్లు ప్రభుత్వం పంపిణీ చేసినట్లు సమాచారం. వీరిలో ఎక్కువ శాతం వినికిడి వికలత్వ నకిలీ ధ్రువపత్రాలు పొంది కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుత ప్రభుత్వం వికలత్వ పింఛన్లు 3000 నుండి 6000 వేల వరకు పెంచింది . వికలత్వ పింఛన్ ను ప్రస్తుతం రెట్టింపు చేయడం వల్ల ఈ నకిలీ పత్రాలు పొందే వారి సంఖ్య ఎక్కువ అయ్యే అవకాశం ఉన్నందున, ప్రభుత్వం స్పందించి రాష్ట్రవ్యాప్తంగా చెవిటి నకిలీ ధ్రువపత్రాలు పొందుతున్న వారిని ఆధునిక యంత్ర పరికరాల ద్వారా వినికిడి లోపాన్ని గుర్తించి, అటువంటి వారిని అరికట్టాలని, నకిలీ సర్టిఫికెట్లు ఇస్తున్న డాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకొని కోట్ల రూపాయల ప్రభుత్వ ఖజానాను గండి కొడుతున్న వారిపై కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

సూర్య
28 శుక్రవారం, జూన్ 2024

## వీకే అపార్టుమెంటులో కారు దగ్ధం

**పాక్షికంగా దెబ్బతిన్న మరో కారు, రెండు స్కూటర్లు**

**సుమారు 6 లక్షల మేర ఆస్తి నష్టం**





రాయచోటి, మేజర్‌న్యూస్: అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం మాసాపేటలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల పక్కనే ఉన్న వీకే అపార్టుమెంటు క్రింద పార్కింగ్ లో ఉన్న ఒక కారులో నుంచి ఉన్నట్లుండి మంటలతో పాటు దట్టమైన పొగలు పైకి వ్యాపించాయి. దీంట్లో అపార్టుమెంటులో నివాసం ఉన్న వారు భయాందోళనకు గురై బయటికి పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో రెండు కార్లు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. ఇందులో ఒక కారు పూర్తిగా ఖాళీ బూడిదయింది. మరొక కారు పాక్షికంగా దెబ్బతిన్నది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం తెలపడంతో హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది శ్రీ సాయి ఇంజనీరింగ్ కాలేజ్ పక్కన ఉన్నటువంటి వీకే అపార్టుమెంటు కింద పార్కింగ్ లో ఉన్న దగ్ధమవుతున్న కారులోని మంటలను అదుపు చేశారు. అదేవిధంగా హై కాన్సెంట్రేషన్ ఉన్న హెూమ్ ద్రవమును వినియోగించి ఫైర్ విస్తరించకుండా ఆర్పి వేశారు. ఇందులో రెండు కార్లు ఒకటి పూర్తిగా కాలి ఉన్నది, మరొకటి పాక్షికంగా కాలి ఉన్నది మరియు రెండు స్కూటర్లు పాక్షికంగా ఖాళీ ఉన్నాయని అగ్నిమాపక అధికారి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు 6 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు ఆయన తెలిపారు. అంతేకాకుండా చుట్టుపక్కల ఆస్తి విలువ సుమారుగా 25 లక్షల వరకు సేవ్ చేయడం జరిగిందని అని తెలిపారు.

## జూలై 4న జిల్లాలో సంపూర్ణత అభయాన్ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలి

మొదటి పేజీ తరువాయి

గర్భిణుల శాతం, మట్టి నమూనా సేకరణ లక్ష్యంలో జారీ చేయబడిన నేల ఆరోగ్య కార్డుల శాతం, అలాగే రివాల్వింగ్ ఫండ్ కలిగిన స్వయం సహాయక సంఘాల శాతం లపై వైద్యారోగ్య, ఐసిడిఎస్, వ్యవసాయ, డిఆర్డిఏ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించి పలు అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.... భారత ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా చేపట్టిన ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం క్రింద అన్నమయ్య జిల్లాలో కోడూరు, కురబలకోట మరియు లక్కిరెడ్డిపల్లి మండలాలు ఎంపిక కాబడినట్లు చెప్పారు. సంపూర్ణత అభయాన్ కార్యక్రమం క్రింద నీతి ఆయోగ్ ఎంపిక చేసిన ఆరు ఇండికేటర్స్ లకు సంబంధించి నూరు శాతం పురోగతి సాధించడానికి జూన్, జూలై మరియు ఆగస్టు మూడు నెలలకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం క్రింద వెనుకబడిన అన్నమయ్య జిల్లా కూడా ఉందన్నారు. వెనుకబడిన జిల్లాను ఆయా ఇండికేటర్ల అమలు ద్వారా అభివృద్ధిలోకి తీసుకెళ్లడానికి ఇది ఒక మంచి అవకాశం అన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమం కింద చేపట్టే నిర్దేశించిన ఇండికేటర్లలో చిత్తశుద్ధితో నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం వాటిని జిల్లా వ్యాప్తంగా అమలు చేసుకోగలుగుతామని పేర్కొన్నారు. ఆయా మండలాలలోని బ్లాక్ లలో ఈ కార్యక్రమం పట్ల ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని, అలాగే క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు. ప్రజలు భాగస్వాములై కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఇందుకు ఆయా బ్లాకుల వారీగా పంచాయితీ, మండల స్థాయిలో ఒక యాక్షన్ ప్లాన్ ను రూపొందించుకోవాలని సూచించారు. అధికారుల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యం. పంచాయితీ, మండల స్థాయిలో సమన్వయ సమావేశాలు నిర్వహించి కార్యక్రమం అమలు పట్ల అవగాహన పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమం అమలుకు పంచాయతీ మరియు మండల స్థాయిలలో నోడల్ అధికారులను ఏర్పాటు చేస్తామని, వారు కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా బాధ్యతగా పనిచేయాలన్నారు. సంపూర్ణత అభియాన్ పథకాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలు జారీ చేశారు.

# వైసీపీ కార్యాలయానికి అనుమతులు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటాం

**వైసీపీ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి రాముడు**

**నిర్మాణం గురించి జెసి ఆర్డిఓ లతో చర్చించిన మంత్రి**

**భారీగా చేరుకున్న పోలీసు బలగాలు - ఆంధ్రుల జీవనాడి పోలవరం**

**స్పీకర్‌ను జగన్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారు**





రాయచోటి, మేజర్ న్యూస్: అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యా లయాన్ని గురువారం నాడు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సందర్శించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మన్ ఆహ్మద్, ఆర్డీవో రంగస్వామిలను ఆ నిర్మాణాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ ఆదేశాల మేరకు ఈ వైసిపి పార్టీ కార్యాలయాలను సందర్శించడం జరిగిందన్నారు. గత 5 సంవత్సరాలలో ప్రజాధనం ఏ విధంగా మట్టిపాలు అయిందో ఈ భవనం నిదర్శమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేస్తే ఏదో జిల్లాలు అభివృద్ధి జరుగుతాయని అనుకున్నామని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి 26 జిల్లాలలో ప్రజల భూములను కాజేసి వైసిపి కార్యాలయాల కోసం పెద్ద పెద్ద భవంతులు నిర్మిస్తున్నారన్నారు. ప్రజాధనంతో ప్రజల భూములను కబ్జా చేసి వైసీపీ కార్యాలయాలను నిర్మిస్తున్న ఘనత మన కడప జిల్లా వాసి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వందల కోట్లు ఖర్చు చేసి వైసిపి పార్టీ కార్యాలయాలు కట్టడం చాలా బాధకరమన్నారు. 5 సంవత్సరాల కాలంలో రైతులు, కార్మికులు, నిరుద్యోగులు పడుకున్న కష్టాలను పక్కన పెట్టి అధికారం కోసం పార్టీ మనుగడ కోసం ఈ విధంగా పార్టీ ఆఫీస్ లు కట్టడం సిగ్గులేదా జగన్ మోహన్ రెడ్డి అని ప్రశ్నించారు. ఒక పర్యాయం అధికారం ఇచ్చినందుకే వేలాది కోట్లు ప్రజాధానం కాజేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక్క వైసిపి ప్రభుత్వం అన్నారు. ఈ వైసిపి పార్టీ కార్యాలయంలో అడుగుపెడుతానని కలలో కూడా అనుకోలేదన్నారు. ప్రజాధనం దుర్వినియోగం అయింది కాబట్టే మంత్రి హోదాలో ఇక్కడికి రావడం జరిగిందన్నారు. ఈ భవనంలో ఫ్లోరింగ్ ఒక్క అడుగుకు 500 రూపాయాలు ఖర్చు చేశారన్నారు. దీనిని బట్టి చూస్తే ప్రజాధానం ఏ విధంగా దుర్వినియోగం అయిందో అర్థం అవుతుందన్నారు. ఈ నిర్మాణం ప్రజలకు సంబంధించిన ఆస్తి కాబట్టి ప్రభుత్వ పరంగా ఏ విధంగా ఉపయోగపడుతుందో ఆ విధంగా ఉపయోగించాలని ప్రభుత్వాన్ని కోరుతానని ఆయన తెలిపారు. ఈ నిర్మాణాలను మొదలు పెట్టిన ఆయోధ్యరామిరెడ్డి రామ్‌కి కంపెనీకి గత ప్రభుత్వం ఏ విధంగా లబ్ది చేకూర్చిందో అర్థం చేసుకోవచ్చునని తెలిపారు. జగన్ లాగా జెసిపిలను పెట్టి బిల్డింగులను కొట్టే దుస్థితి మా ప్రభుత్వానికి పట్టలేదన్నారు. తహసిల్దార్ నుంచి కలెక్టర్ వరకు కళ్ళు మూసుకుని లాలూచీ పడి అనుమతులు ఇచ్చిన అధికారులపై చట్టపరంగా ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు.

### ప్రతిపక్ష హోదా లేని వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు :

ప్రతి పక్ష హెూదా లేని వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. గుట్కా నమిలేవాడికి, నాటుసారా తాగే వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. జగన్ చేసిన తప్పులు మా ప్రభుత్వం చేయదని స్పష్టం చేశారు. 104,108 వాహనాలను బెంచ్ సర్కిల్ నుంచి వారధి వరకు పెట్టి ఒక్క రోజు సంబరాలు చేసుకుని 364 రోజులు ప్రజలను కష్టాల పాలు చేశారన్నారు పథకాలు అమలు చేయడానికి జగన్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. అయినప్పటికీ తెలుగు దేశం ప్రభుత్వం మ్యానిపెస్టోలో చెప్పిన విధంగా ఒక్కొక్కటి అమలు చేస్తామన్నారు. ఈ క్రమంలో జూలై 1వ తేదీన 4వేలు పింఛన్ ఇస్తున్నామన్నారు. సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం పక్క రాష్ట్రాలు అములు చేస్తున్నాయని వాటిలో పొరపాట్లు తెలుసుకుని సమీక్షించి ఏ విధంగా సమస్యలు లేకుండా పక్కగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పోలవారాన్ని జగన్ ప్రభుత్వం ఏ విధంగా నాశనం చేసిందో ప్రతి ఒక్కరికి తెలుసు అన్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన వారం రోజుల్లోనే పొలవరాన్ని సందర్శించడం జరిగిందన్నారు. త్వరలోనే నిపుణుల కమిటీ కూడా పొలవరాన్ని కూడా సందర్శించడం జరుగుతుందన్నారు. ఆంధ్రుల జీవనాడి పోలవరం అన్నారు. అసెంబ్లీ స్పీకర్‌ను కూడా జగన్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం కౌరవుల ప్రభుత్వం అని, తెలుగు దేశం ప్రభుత్వం గౌరవ ప్రభుత్వం అని చమత్కరించారు. ఈ కార్యక్రమంలో భారీగా పోలీసులు మొహరించారు.

## ఆస్తికోసం అత్తమామలను చంపిన కోడలు

మొదటి పేజీ తరువాయి

ఆసుపత్రికి తరలించారు అక్కడ చికిత్స పొందుతూ వారు మరణించినట్లు తెలిపారు. అత్తమామల దగ్గర నుండి ఆస్తి రాయించుకున్న తర్వాత వారి బాగోగులు చూసుకోవడానికి వీలుకాక వారిని శాశ్వతంగా పైకి పంపాలని ఆలోచనతో కోడలు ఈ విధంగా చేసిందని సమాచారం. ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ పక్కగా నిర్వహించండి

మొదటి పేజీ తరువాయి

మొత్తం ప్రతి ఒక్కరికి 7000 రూపాయలు పెన్షన్ దారులకు పంపిణీ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. హెచ్.ఐ.వి, వేరే ఊరులో చదువుకుంటున్న అంగవైకల్యం గల విద్యార్థులకు డి.బి.టి పద్ధతి లోనే ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. విసి ముగిసిన అనంతరం.... జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాట్లాడుతూ... గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పెన్షనర్ల క్లస్టర్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.సచివాలయాల పరిధిలో సిబ్బంది కొరతగా ఉన్నచోట్ల ఇతర ప్రభుత్వ అధికారులను నియమించుకొని పంపిణీ చేయాలని సూచించారు. జూలై 29 తేదీన శనివారం పంచాయతీ సెక్రటరీ, వార్డ్ వెల్ఫేర్ సెక్రెటరీ, మరో సచివాలయ సెక్రెటరీ సమక్షంలో బ్యాంకుల నుంచి నగదును విత్డ్రా చేసి సిబ్బందికి అందించాలని ఆదేశించారు.విత్ డ్రా చేసిన నగుదును సచివాలయ సిబ్బంది సురక్షితంగా ఉంచుకొని జూలై 1 తేదీన తెల్లవారుజాము నుంచి జిల్లాలో పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఏ ఆనంద్ నాయక్, సీపీఓ వెంకటరావు, అనుడా విసి నందన్, ఎల్ డి ఏం జనార్ధన్, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి జి వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కెజి బివి సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించండి

## జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మీసాల శేఖర్ బాబు



కలసపాడు మేజర్ న్యూస్: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలలో పనిచేస్తున్న బోధన మరియు బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు యం .శేఖర్ బాబు డిమాండ్ చేశారు. సభ్యత్వనమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం కలసపాడు మండలం లోని పెండ్లిమర్రి దగ్గర గల, కెజిబివి విద్యాలయాన్ని సందర్శించడమైనది. ఈ సంధర్భంగా శేఖర్ బాబు మాట్లాడుతూ, చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ, గ్రామీణ ప్రాంతాలలోని పేద,బడుగు, బలహీన,అనాథ వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధికోసం నిరంతరం కృషి చేస్తున్న కెజిబివి స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్టీలు, బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే అని డిమాండ్ చేశారు పని చేస్తున్న సీఆర్టీలకు మినిమమ్ టైమ్ స్కేలు వర్తింపు, విషయంలో క్రమబద్ధీ కరించడం లోనూ ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. ఇదే కాక "మూలిగే నక్కపై తాటికాయ పడ్డ" చందాన పనితీరు సూచికలు,విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం ఆధారంగా సర్వీసును రెన్యువల్ చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. రకరకాల నిబంధనలను అగ్రిమెంటులో చేర్చి,బలవంతంగా సంతకాలు చేయించుకుని వారిని నిరంకుశ విధానంలో పనిచేయడం ఎంతవరకు సబబో ఆలోచించాలన్నారు. గతంలో రెండు రోజుల వ్యవధితో సర్వీసును పునరుద్ధరిస్తే,ఈ సారి నాలుగు రోజుల వ్యవధితో కేవలం నలభై రోజులకు మాత్రమే రెన్యువల్ చేయడం అన్యాయమన్నారు. జూనియర్ కాలేజీలలో పిల్లల అడ్మిషన్లు తగ్గిపోవడానికి కారణాలు అన్వేషించకుండా పిజిటిలను బాధ్యులను చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అదే విధంగా వార్డన్ పోస్టులు,నైట్ వాచ్ మెన్ పోస్టును మంజూరు చేసి,ప్రభుత్వ ఉపాధ్యాయులకు వర్తించే అన్నిరకాల సెలవులు వర్తింపజేయాలన్నారు. కెజిబివి సిబ్బంది సమస్యలను నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి. వెంకటరెడ్డి, బి.ఎన్.వి.ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యుడు ఎన్.శివా రెడ్డి, జిల్లాకౌన్సిలర్ కె.విజయభాస్కర్ రెడ్డి, మహిళా కార్యదర్శి బేబీ సరోజ, స్పెషల్ ఆఫీసర్ రెడ్డిజ్యోతి, సీఆర్టీలు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా నిర్మించిన జగన్ భవనాలు

## జిల్లా కార్యాలయాన్ని, కాంప్లెక్స్ పరిశీలించిన ఎమ్మెల్యే మాధవి



కడప రూరల్ మేజర్ న్యూస్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో నా రాజ్యం, నా ఇష్టం అనే విధంగా రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా వైసిపి కార్యాలయాలను గెస్ట్ హౌస్ లు లా నిర్మించుకున్నారని కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి తీవ్రస్థాయిలో విమర్శించారు నగరంలోని మూడవ డివిజన్లో 75% పూర్తి అయిన జిల్లా వైసీపీ కార్యాలయాన్ని, రాజారెడ్డి పెట్రోల్ బంకు వద్ద కాంప్లెక్స్ ను గురువారం ఎమ్మెల్యే మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి లు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ అన్ని అక్రమ నిర్మాణాలేనని ధ్వజమెత్తారు వైసీపీ కార్యాలయ నిర్మాణానికి అనుమతి లేదని, అలాంటప్పుడు నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకోక, ఎందుకు నిర్లక్ష్యం వహించారని ప్రశ్నించారు. ప్రజలకు అవసరమయ్యే విధంగా ప్రభుత్వ స్థలాలను ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. జగన్ కేవలం ఆస్తులు పెంచుకోవడంలో భాగమే కార్యాలయ నిర్మాణాలని వారు తప్పుపట్టారు. ఒక సెంటు పేదలకు ఇచ్చి, ఆ ఇండ్లకు రోడ్లు, కాలువలు, విద్యుత్తు, నీటి వసతులు సమకూర్చక, పార్టీ కార్యాలయాన్ని ఇంద్ర భవనంలా అక్రమంగా నిర్మించుకుంటారా అని నిలదీశారు. వైసిపి కార్పొరేటర్ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని అమ్ముకున్నారని, వేసిన ప్లాట్లపై విచారణ జరిపిస్తామని హెచ్చరించారు. వైసిపి కార్యాలయ నిర్మాణ స్థలం, గతంలో పేదలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ముమ్మాటికి అక్రమ నిర్మాణమే అని తేల్చి చెప్పారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు, స్థలాలు స్వాధీనం చేసుకుంటామని వారు చెప్పారు.

# అధికారులూ... సమన్వయంతో పని చేయండి

## టిడిపి ఇన్చార్జి దాసరిపల్లి జయచంద్ర రెడ్డి



ములకలచెరువు, మేజర్ న్యూస్ : తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయంలో గురువారం తంబళ్లపల్లె నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డి మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతపాలనలో అవినీతికి పాల్పడిన అధికారుల పప్పులు ఊడకవని ఇది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన జాగ్రత్తగా గమనించాలని అధికారులను జయచంద్రారెడ్డి పరోక్షంగా హెచ్చరించారు. సీఎం ఆదేశాల మేరకు తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ఆరు మండలాల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయడానికి ఓ ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లనున్నట్లు హామీ ఇచ్చారు. అధికార యంత్రాంగం గత వైకాపా ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి న్యాయం చేయడానికి సహకరించాలన్నారు. గత పాలనలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపి వారు చేసిన అవినీతి బట్టబయలు చేస్తామని అక్రమంగా కాజేసిన సొమ్మును అనా పైసా తో సహా కక్కిస్తామన్నారు. అధికారులు సైతం నిష్పక్షపాతంగా పనిచేసే ప్రతి శాఖలోనూ ప్రక్షాళన చేసి తమ నిజాయితీని నిరూపించుకొని నిరుపేద ప్రజల అభివృద్ధి కోసం సహకరించాలన్నారు. చంద్రబాబు పెంచిన పెన్షన్లను ఒకటో తేదీ ప్రతి లబ్ధిదారుల ఇంటికి చేర్చాల న్నారు. రైతుల సమస్యలపై రెవెన్యూ అధికారులు కార్యాలయం చుట్టూ తిప్పకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. గతంలో వైకాపా ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసిన అధికారులు వెంటనే స్వచ్ఛందంగా తప్పుకోవాలని అవినీతి అధికారులను పరోక్షంగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమూర్తి, తాసిల్దారు బ్రహ్మయ్య, మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, మండల స్థాయి అధికారులు, తెలుగు దేశం, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాను మంత్రి రాంప్రసాద్ రెడ్డి అభివృద్ధి పథంలో నడిపిస్తారు

## – జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ కితాబు



మదనపల్లి,మేజర్ న్యూస్ : రాష్ట్ర రవాణా,క్రీడా సాంస్కృతిక శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నమయ్య జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తారని టిడిపి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ కితాబునిచ్చారు. గురువారం బీసీ నాయకులు అనగాని రెడ్డెప్ప,ఆనంద్ యాదవ్,రెడ్డిలతోపాటు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పి.సురేంద్ర యాదవ్ మాట్లాడుతూ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఎంతో ప్రజాధరణ కలిగిన నాయకుడని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఆయన నిరంతరం పనిచేస్తారని కొనియాడారు. మండిపల్లి కుటుంబ నేపథ్యం, రాంప్రసాద్ రెడ్డి సమర్థతను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రి పదవిని అప్పగించా రన్నారు. అన్నమయ్య జిల్లా నుండి మంత్రిగా ఎన్నికైన ఆయన అన్ని నియోజక వర్గాలపై దృష్టి సారిస్తారన్నారు. అదేవిధంగా తంబళ్లపల్లి నియోజక వర్గం అభివృద్ధికి సహకరించాలని ఆయనను కోరమన్నారు. అదేవిధంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి కొరకు తనవంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారని పి.సురేంద్ర యాదవ్ పేర్కొన్నారు.

# కూల్చిన ఇంటి నిర్మాణాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కొరముట్ల



రైల్వే కోడూరు మేజర్ న్యూస్ రైల్వే కోడూరు నియోజకవర్గంలోని మంగంపేట యానాదులు నివాసులు ఉండే ఇంటి నిర్మాణాలను బుధవారం ఏపీ ఎండిసి సంస్థ అక్రమంగా కూల్చివేసిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులు బాధితులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎటువంటి నోటీసులు అనుమతులు లేకుండా నిర్మాణాలను కూల్చివేయడం అత్యంత దారుణమని ఆయన అన్నారు. ముఖ్యంగా ఏపీఎండిసి సంస్థ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ ఇండ్ల నిర్మాణాలను కూల్చివేయడం దారుణమని అన్నారు. నిజాయితీగా ఉండవలసిన కూటమి ప్రభుత్వం యానాదులపై కక్ష సాధింపుగా నిర్మాణాలను కూల్చడం దారుణమని ఆయన అన్నారు. ఆయనతో పాటు మంగంపేట పారిశ్రామికవేత్త గుత్తి రెడ్డి హరినాద్‌రెడ్డి, పంజం సుకుమార్ రెడ్డి, రామిరెడ్డి ధ్వజారెడ్డి, గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, భరత్ పాల్గొన్నారు.

# ఘనంగా ఉప్పరపల్లి జాతర

## మొక్కులు చెల్లించుకున్న ముక్కారూపానంద రెడ్డి



రైల్వే కోడూరు మేజర్ న్యూస్ రైల్వే కోడూరు మండలంలోని ఎస్.ఉప్పరపల్లె గ్రామంలో అత్యంత వైభవపేతంగా జరిగిన గంగమ్మ జాతరకు కోడూరు తెలుగు దేశం పార్టీ ఇన్చార్జి ముక్కారూపానంద రెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అత్యంత వైభవంగా గంగమ్మ జాతర కార్యక్రమానికి రైల్వే కోడూరు నియోజకవర్గం నుండి కాకుండా ఇతర ప్రాంతాల నుండి భారీ ఎత్తున రాజకీయ నాయకులు ప్రముఖులు విచ్చేశారు .ముఖ్యంగా గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు పుర ప్రముఖులు పాల్గొని గంగమ్మ జాతర కార్యక్రమానికి మొక్కలు చెల్లించుకున్నారు. అదేవిధంగా రైల్వేకోడూరు మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, పంజం సుకుమారెడ్డి, రామిరెడ్డి ధ్వజారెడ్డి తోపాటు వైసీపీకి చెందిన పుర ప్రముఖులు పాల్గొన్నారు. అయితే గ్రామంలో ఎన్నో సంవత్సరాలగా వాయిదా పడిన గంగమ్మ జాతరకు ఎట్టకేలకు గురువారం జరగడంతో భారీ ఎత్తున జనాలు పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జనసేన తాతంశెట్టి నాగేంద్ర, పిసిఎన్ బ్రదర్స్, మంగం పేట టిడిపి నాయకులు తల్లెం రమణారెడ్డి, కొండయ్య నాయుడు, సుబ్బరామి రెడ్డి, తిరుపతి శేఖర్, కేశవరెడ్డి, మునిపెంచల్ రెడ్డి పాల్గొన్నారు.

# ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు అభినందనలు తెలిపిన ప్రహ్లాద రెడ్డి



కలసపాడు మేజర్ న్యూస్: మంత్రి నారా లోకేష్‌ను కలసపాడు మండలంలోని ఎగువ తంబళ్లపల్లె యువ నాయకుడు ప్రహ్లాదరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం బద్వేల్ నియోజకవర్గంలోని కలసపాడు మండలంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు నియోజకవర్గ అభివృద్ధికి తమరు సహాయ సహకారాలు అందించాలని కోరారు మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారని నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని మంత్రి లోకేష్ పేర్కొన్నారని ప్రహ్లాద రెడ్డి తెలిపారు.

# శీతల గంగమ్మ, అమ్మవారి ఆహ్వాన పత్రిక అందజేత



సిద్ధవటం మేజర్ న్యూస్ సిద్ధవటం మండలం మాధవరం- 1 గ్రామ పంచాయతీ పార్వతీపురంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ 21వ జాతర ఆహ్వానిక పత్రిక గురువారం ఆలయ కమిటీ సభ్యులు, రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు అతికారి కృష్ణకు అందజేశారు. ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు చేయించి ఘనంగా శాలువతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలు అందించారు. కృష్ణ మాట్లాడుతూ జులై 24వ తేదీన ప్రారం భమయ్యే అమ్మవారి ఉత్సవాలకు అందరము కలిసి జాతర మహోత్సవం ఘనంగా జరుపుతామని అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జూలై 1 నుంచి డయేరియాపై అవగాహన కార్యక్రమాలు



కడప ఐటిఐ సర్కిల్, మేజర్‌న్యూస్ : జులై ఒకటవ తేదీ నుండి ఆగస్టు 31వ తేదీ వరకు ప్రతి గ్రామం, వార్డులలో డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తపై అవగాహన ప్రజలకు కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.నాగరాజు పేర్కొన్నారు. గురువారం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయములోని ఆయన చాంబర్‌లో విలేకరులకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 15వ తేదీ నుండి 30వ తేదీ వరకు 15 రోజులు వైద్యాధికారులకు, వైద్య సిబ్బందికి స్టాప్ డయేరియా క్యాంపెయిన్ పై అవగాహన కల్పిచడం జరిగిందని, జిల్లా కలెక్టర్ జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించి లైన్ డిపార్ట్మెంట్స్ అందరూ కూడా ఈ కార్యక్రమంలో భాగస్తులై డయేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డయేరియా అనేది కలుషితమైన ఆహారము,నీరు తీసుకోవడం వలన వస్తుందని, ఈ వ్యాధి సోకితే అధిక నీళ్ల విరోచనాలతో మనిషి నిరసించిపోతాడని, డయేరియా రాకుండా జాగ్రత్తల గురించి అవగాహన కల్పించవలెనని, ప్రతి ఇంటికి వెళ్లి ఐదు సంవత్సరంలోపు పిల్లలను గుర్తించి ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్స్, జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు, పంచాయతీ సిబ్బందితో కలిసి త్రాగునీటి సరఫరాలో అనగా వాటర్ ట్యాంకుల నుండి నీటిని కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయించవలెననియు, పైప్ లైన్ ఏదైనా లీకేజ్ ఉన్నట్టయితే వాటిని వెంటనే గుర్తించి బాగు చేయించవలెనని చెప్పారు. రిమ్స్, ఏరియా హాస్పిటల్స్, డిస్టిక్ హాస్పిటల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రములు, విలేజ్ హెల్త్ క్లినిక్స్ నందు ఓ.ఆర్.ఎస్, జింక్ కార్నర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశమునకు డాక్టర్ కే.నాగరాజు డి.ఎం. హెచ్.ఓ, డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డి.ఐ.ఓ, డాక్టర్ రవిబాబు, డి.ఎల్.ఏ.టి.ఓ, రమేష్ రెడ్డి, ఎస్.ఓ, డెమో సిబ్బంది, రాధాకృష్ణ ఎం.పీ.హెచ్.ఈ.వో తదితరులు పాల్గొన్నారు.

# మా కుమారుని కేసును పునఃపరిశీలించి న్యాయం చేయాలి

## వృద్ధ తల్లిదండ్రుల వేడుకోలు



కడప సిటి, మేజర్ న్యూస్: తమ కుమారుడు కొవ్వూరు సుబ్బరాయుడుకు సంబంధించిన కేసును పునఃపరిశీలించి తమ కుటుంబానికి న్యాయం చేయాల ని పాత కడప దళిత వాడకు చెందిన కొవ్వూరు పాల కొండయ్య, కుమారి అనే వృద్ధ దంపతులు వేడుకున్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు తమ కుమారుడు సుబ్బరాయుడు 2006 లో బుగ్గలేటి పల్లెలో మొదటి భార్యను వివాహం చేసు కున్నాడని ఆమె బాలింత జబ్బుతో చనిపోగా రెండో భార్యను జంగం పల్లెకు చెందిన కవితను పెళ్లి చేసుకున్నాడని చెప్పారు కొన్ని సంవత్సరాలు సహజీవ నం చేశారని చెప్పారు అదే సమయంలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్న అనిల్ కుమార్‌తో అక్రమ సంబంధం పెట్టుకొని తమ కొడుకును ని త్యం వేధిస్తూ ఉండేదని వాపోయారు అక్రమ సంబంధం తెలుసుకున్న తాము అనేక సార్లు డ్రైవర్ అనిల్ కుమార్‌ను మందలించగా మీ అందరినీ చంపే స్తానని రౌడీలా బెదిరించే వాడని ఆవేదన వ్యక్తంచేశారు, ప్రతి రోజూ తమ ఇంటికి వచ్చి మా కళ్ళ ఎదుటే కలిసి ఉంటూ విచ్చలవిడిగా వ్యభిచారం చేస్తూ ఉండే వారని తెలిపారు 5-7- 2020 న తమ కుమారుడు సుబ్బరాయుడు కు ఈ విషయం తెలిసి కవితను కొట్టడంతో ముందుగా అనుకున్న ప్రకారం అనిల్ కుమార్‌ను ఇంటికి పిలిచిపించి సుబ్బరాయుడుకు బలవంతంగా మద్యం తాపించి ఇద్దరు కలిసి అదేరోజు హత్యచేశారని తెలిపారు. ఈ విష యానికి సంబంధించి పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టగా ఆత్మహత్యగా నమోదు చేశారని చెప్పారు. తాము పేదలమని ఎలాంటి రాజకీయ పలుకుబడి లేదని చెప్పారు కావున ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించి తమ కుటుంబానికి న్యా యం చేయాలని వారు కోరారు ఈ సమావేశంలో హతుని కుమార్తె స్వర్ణ కుమారి, బంధువులు నిత్య పూజయ్య తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతి

### రవాణా,యువజన క్రీడల శాఖ మంత్రిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోయేషన్ అధ్యక్షుడు నరసింహ కుమార్



రాయచోటి, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా ,యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని రాయచోటి పట్టణం మండిపల్లి భవన్ తెలుగుదేశం పార్టీ క్యాంప్ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహ కుమార్ ఇతర అసోసియేషన్, రెవెన్యు ఉద్యోగులు గౌరవ ప్రదంగా కలిసి పుష్ప బుక్కే లు అందజేసి వారికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రెవెన్యు శాఖలో ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్ళి పరిస్కరించేల కృషి చేయాలనీ వారికీ విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి వర్యులు రెవెన్యు ఉద్యోగుల యొక్క న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిస్కరించేల కృషి చేస్తానని భరోసా కల్పించినట్లు అన్నమయ్య జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోయేషన్ అధ్యక్షుడు నరసింహ కుమార్ తెలిపారు.

# విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలి

### సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబైలైజేషన్ ఆఫీసర్ మిట్టా కేశవ రెడ్డి



మైదుకూరు, మేజర్ న్యూస్: ప్రాఠశాలల్లో డెటాల్ బనేగా స్వస్థ ఇండియా పరిశుభ్రత కార్యక్రమల అమలు తప్పనిసరి చేయాలని సమగ్ర శిక్ష ఎమ్ఐఎస్, ప్లానింగ్ కో ఆర్డినేటర్ సార్డ్స్ గ్రామాలయ ఆధ్వర్యంలో " డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా" ప్రాజెక్ట్‌లో భాగంగా ఖాజీపేట, మైదుకూరు,చాపాడు మండలకు చెందిన 75 పాఠశాలల ఉపాధ్యాయులకు మైదుకూరు మండల విద్యా వనరుల కేంద్రంలో మైదుకూరు మండల విద్యాశాఖ అధికారి పద్మలత అధ్యక్షతన ఒకరోజు హ్యాండ్ వాష్ మీద అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ మిట్టా కేశవ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తి గత పరిశుభ్రత, ఆరోగ్యం పై దృష్టి సారించాలనీ బాత్రూం, మరుగుదొడ్లు, ప్రతీరోజూ 2 సార్లు ఆయాలచే శుభ్రం చేయించాలనీ, అవి అపరి శుభ్రంగా వుంటే విద్యార్థుల ఆరోగ్యం, చదువు పై పడే ప్రమాదముందన్నారు. ప్రతీ రోజూ భోజనానికి ముందు, టాయిలెట్‌కి తర్వాత డెటాల్ లేదా సబ్బుతో చేతులు కాళ్ళు శుభ్రం చేసుకోవాలి. చేతులు శుభ్ర పరచే 6 రకాల విధానాలు తెలియసేశారు. డెట్టాల్ బనేగా స్వస్థ ఇండియా సమగ్ర శిక్ష ఎమ్ఐఎస్ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రాజు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ పాఠశాలను తమ స్వంతంగా భావించి విద్యార్థులను తమ స్వంత పిల్లలుగా భావించాలని, వారి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతుండాలనీ, పాఠశాలలలో స్వచ్ఛతా కార్యక్రమం నిరంతరం అమలయ్యేలా చూడాలన్నారు. డిబిఎస్ఐ జిల్లా సమన్వయకర్త విష్ణు వర్ధన్ కార్యక్రమం గూర్చి వివరిస్తూ చేతులు పరిశుభ్రత గురించి కృత్యాలు చేసి చూపించి ఉపాధ్యాయులచే చేయించటం జరిగింది. మైదుకూరు మండల విద్యాశాఖ అధికారి పద్మలత , ఎమ్ ఈ ఓ 2 నరహరిశర్మ కార్యక్రమం ఉద్దేశ్యం,అమలు జరుగుటకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా దేవరాజు జిహెచ్ఎస్ వ్యవహరించారు. డిజిటల్ స్క్రీన్‌పై హ్యాండ్ వాష్ గురించి, ప్రోగ్రాం ఆవశ్యకత గురించి వివరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో డి బి ఎస్ ఐ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విష్ణు వర్ధన్, వాలంటీర్ లు రహమతున్నిష , శివ శంకర్, మోతేఉపేంద్ర, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాశ్రేయస్సు కోసం పరితపించే నాయకుడు మంత్రి రాంప్రసాద్ రెడ్డి

### టిడిపి నాయకులు అనంత (సొసైటీ) రామచంద్ర కితాబు



మదనపల్లె,మేజర్ న్యూస్ : ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే నాయకుడు ఏపీ రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అని మదనపల్లి పట్టణానికి చెందిన టిడిపి నాయకులు అనంత (సొసైటీ) రామచంద్ర కితాబునిచ్చారు.మంత్రిగా బాధ్యతలు చేపట్టిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని పడమటికోనలోని ఆయన నివాసంలో సొసైటీ రామచంద్ర,తన బాల్యమిత్రుడు రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డితో కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా అనంత (సొసైటీ) రామచంద్ర రాయచోటి నియోజకవర్గం ప్రజలను తమ సొంత కుటుంబంలో భావించి,వారి మనసు గెలిచిన ఏకైక నాయకుడు రాంప్రసాద్ రెడ్డి అని కొనియాడారు.కొన్ని దశాబ్దాలుగా నియోజకవర్గం ప్రజలతో మండిపల్లి కుటుంబానికి విడదయరాని అనుబంధం ఉందన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం మండపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారన్నారు.ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించిన అనంతరం ఆయన సమర్థతను గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన మంత్రిమండలిలో చోటు కల్పించడం శుభపరిణామమన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయ,సహకారాలతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి రాయచోటి నియోజకవర్గంతోపాటు అన్నమయ్య జిల్లాని అభివృద్ధిపథంలో నడిపిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఇందులో భాగంగా మంత్రి అనంత రామచంద్ర, ప్రభాకర్ రెడ్డిలను ఎంతో ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తన గెలుపుకు అండగా నిలిచిన ప్రజలు,నాయకులు,కార్యకర్తలకు మరోసారి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు.

# రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి

### సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం నిరసన




మదనపల్లె,మేజర్ న్యూస్ : రైతాంగ సమస్యలు పరిష్కరించాలని మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం,వ్యవసాయ కార్మిక సంఘం మరియు సిపిఐ నాయకులు నిరసన తెలిపి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా గురువారం తోపు కృష్ణప్ప మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రైతులకు 20 వేలు ఈ ఖరీఫ్ సీజన్లోనే అందించేందుకు కృషి చేయాలని కోరారు.పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ను పెంచి రూ. 3 లక్షల వరకు వడ్డీ లేకుండా, రూ. 5 లక్షలు వరకు పావలా వడ్డీ రుణంతో పంటరుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ చేపట్టి రుణాలు అందించాలన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్ట్ కింద ఉన్న ప్రధాన కాలువలు, మేజర్ మైనర్ కాలువలతోపాటు డెల్టా ప్రాంతాలలోనే మురుగునీటి కాలువలు మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని కోరారు.గత ప్రభుత్వ కాలంలో ప్రభుత్వం సేకరించిన ధాన్యం బకాయిలను రైతాంగానికి వెంటనే చెల్లించాలని, నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఖరీఫ్ సాగుకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు వరి వేరుశనగ, కంది, విత్తనాలను 90 శాతం సబ్సిడీపై రైతాంగానికి అందించాలన్నారు.వ్యవసాయానికి అవసరమైన వ్యవసాయ పనిముట్లకు 90 శాతం సబ్సిడీ కింద పరికరాలు రైతాంగానికి పంపిణీ చేయాలని,కల్తీ విత్తనాలను అరికట్టి కల్తీ విత్తనాలు అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో మార్పులు తేవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సాంబశివ,వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ నాయకులు తిరుమల రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా అధ్యక్షులు ముని కాటయ్య, రవి కుమారి, గౌరీలు పాల్గొన్నారు.

## ఫైర్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకట సుబ్బయ్య



వేంపల్లె మేజర్‌న్యూస్: వేంపల్లె అగ్నిమాపక కేంద్రం స్టేషన్ ఆఫీసర్ గా కె. వెంకట సుబ్బయ్య గురువారం నూతన బాధ్యతలు చేపట్టారు. అనంతరం లీడింగ్ ఫైర్ అధికారి హరి బాబు, జగన్నాథరెడ్డి, ఉత్తమారెడ్డి, భీమాంజనేయులు, డ్రైవర్ శివ కుమార్ ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అనేక అగ్ని ప్రమాదాలు నివారించడం, మూగజీవాలు రక్షించడం, ప్రజలను రక్షించడం, వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడడం లాంటివి చేశామన్నారు. అలాగే వేంపల్లె అగ్నిమాపక కేంద్రానికి ఫైర్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టామన్నారు.

## పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపిన ఆర్యవైశ్య ప్రముఖులు



మైదుకూరు, మేజర్‌న్యూస్: మైదుకూరు నూతన శాసనసభ్యులుగా ఎన్నికైన పుట్టా సుధాకర్ యాదవ్‌ను గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపిన మైదుకూరు ఆర్యవైశ్య సభ అధ్యక్షులు సూరిశెట్టి శివ వెంకట ప్రసాద్ గుప్తా, సెక్రటరీ దరిశా వరహాలు సునిల్, కోశాధికారి ఏలిశెట్టి గురు ప్రసాద్, సభ్యులు గుండా ఆనంద్ పబ్బతి వేణు, అయ్యపు శెట్టి సురేంద్ర, నాగేళ్ల శేషుబాబు శీకాకొల్లు గోపాల్ కలసి మైదుకూరు నియోజకవర్గం అభివృద్ధికి కృషిచేయాలని కోరారు.

## హెూమియోపతి మందులతో ప్రజలకు ఆరోగ్యకరం

### హెూమియోపతి డాక్టర్ షాకీర్ హుస్సేన్



కమలాపురం మేజర్‌న్యూస్ : హెూమియోపతి మందులు వాడడం వలన ఎలాంటి సమస్యలు రావని అన్ని రకాల జబ్బులకు హెూమియోపతిలో వైద్య సేవలు ఉన్నాయని హెూమియోపతి వైద్యుడు డాక్టర్ షాకీర్ హుస్సేన్ అన్నారు. కమలాపురం పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థులకు హెూమియోపతి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమయ్యాయని రోగాలు ప్రభలేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు, వర్షాలు పడటం వలన దోమలను మృతి చెంది దోమకాటుతో ప్రజల రోగాల వలన బాధపడే అవకాశం ఉందని దోమలు కుట్టకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు రాత్రిపూట దోమతెర వాడాలని దోమలు ఇంట్లోకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి వాటి నివారణకు హెూమియో మందుల గురించి వివరించారు, విద్యార్థులకు డయేరియా, సీజనల్ వ్యాధులకు హెూమియో మందులు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జీ హెడ్ మాస్టర్ శ్రీదేవి, సైన్స్ ఉపాధ్యాయులు రాఘవ. తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

## షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



పులివెందుల, మేజర్‌న్యూస్ : పులివెందుల పార్నపల్లి రోడ్డు నందు కొలువై ఉన్న మొట్టమొదటి శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉదయాస్తమాన స్వామివారికి పంచామృత అభిషేకం సహస్రనామార్చన ప్రత్యేక అలంకరణ మంగళహారతులు తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ఎంతో పురాతనమైన ప్రసిద్ధిగాంచిన పులివెందులలో మొట్ట మొదట కొలువై ఉన్న శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో ప్రతి గురువారం భక్తుల సహాయ సహకారాలతో పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, స్వామివారిపై ఎంతో నమ్మకముతో ఆలయానికి వచ్చి భక్తులు తమ మొక్కలు చెల్లించుకుని పూజలు నిర్వహించడం జరుగుతోందని తెలియజేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను అందజేశారు .ఈ కార్యక్రమంలో సాయి సేవ సమితి సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శంకరయ్య పెద్దకర్మకు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా రూపానంద రెడ్డి



ఓబులవారిపల్లి మేజర్‌న్యూస్: ఓబులవారిపల్లి మండలం చిన్న ఓరంపాడు పంచాయతీ కమ్మపల్లి గ్రామంలో ఇటీవల హఠాత్తుగా మరణించిన నిడమలూరి శంకరయ్య నాయుడు పెద్దకర్మ కార్యక్రమానికి రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ రైల్వే కోడూరు టిడిపి ఇంచార్జ్ ముక్కా రూపానంద రెడ్డి హాజరై నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు నాగినేని రమేష్ నాయుడు టిడిపి యువ నాయకులు కోటేశ్వరరావు రవీంద్ర నాయుడు నిడమనూరు వెంకటేష్ సుధాకర్ కుమార్ రామకృష్ణయ్య ధనంజయ నాగేంద్ర వాసుదేవ రెడ్డి పొలసాని కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి అభినందనలు తెలిపిన డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్



బద్వేల్ మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల వీరాంజనేయ స్వామిని గురువారం రాష్ట్ర రాజధాని అమరావతిలో ని సచివాలయంలోని మంత్రి చాంబర్ లో కలసి శాలువా పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్ మాట్లాడుతూ కడప జిల్లాలోని బద్వేల్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని గ్రామీణ ప్రాంతాలలో కనీస సౌకర్యాలు కూడా లేక అవస్థలు పడుతున్నారని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవ సరమైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేయడం చాలా అత్యవసర మైనదని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు ఉపాధి అవకాశాలనూ కల్పించాలని ఆయన కోరారు.

## బాబాకి విశేష పూజలు



తొండూరు, మేజర్ న్యూస్ : తొండూరు గ్రామంలో సాయిబాబా ఆలయంలో గురువారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. గురువారం స్వామివారికి ప్రీతికరం కావడంతో ప్రాతఃకాల సమయంలోనే అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా సాయిబాబా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ గావించి విశేష పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయంలో విశేష పూజలు భక్తులతో తరలివచ్చి బాబా వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## సప్లమెంటరీ ఫలితాల్లో అక్షర దే హవా

**- ఎంపిసి, బైపిసి విభాగాల్లో ప్రథమ స్థానం**

**- హర్షం వ్యక్తం చేసిన కరస్పాండెంట్ బి.విజయభారతి**



వేంపల్లె, మేజర్‌న్యూస్: ఇంటర్మీడియట్ సప్లమెంటరీ ఫలితాల్లో వేంపల్లె అక్షర బాలికల జూనియర్ కళాశాల అత్యుత్తమ ఫలితాలతో హవా చాటుకుంది. గురువారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ చూపారని కరస్పాండెంట్ బి.విజయభారతి హర్షం వ్యక్తం చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం, ఎంపిసి నందు ఎస్.ఫాతిమా 457 మార్కులతో మండల స్థాయి ప్రథమ స్థానం, ఎస్.అఫ్సాన 452 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు. సునంద 446, ముత్యాలమ్మ 445, మహిజ 438, భువనేశ్వరి 436, సమ్రీన్ 419 మార్కులు కైవసం చేసుకున్నారు. అలాగే బైపిసి నందు వైష్ణవి 416 మార్కులతో మండల స్థాయి ప్రథమ స్థానం సాధించినట్లు కరస్పాండెంట్ వెల్లడించారు. ఐపిఇ ఫలితాలతో పాటు ఎంసెట్ లో కూడా అధ్భుతమైన ఫలితాలు సాధించే దిశ అనుభవం ఉన్న అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

## కడప జిల్లాలో గుర్తింపు లేని విద్యాసంస్థలపైచర్యలు తీసుకోవాలి



ఖాజీపేట మేజర్ న్యూస్ : కడప జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా నడుస్తున్న చైతన్య నారాయణ, ప్రైవేట్ విద్యా సంస్థలు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ల పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుగ్గిరెడ్డి.రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు అనంతరం సమస్యలపై జిల్లా విద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మున్నీర్ కు భారత విద్యార్థి సంఘం ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం ఆయనకు సమర్పిం చారు అనంతరం ఎస్.ఎఫ్.ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గిరెడ్డి.రాజశేఖర్ రెడ్డి , జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్ మాట్లాడుతు జిల్లాలో కార్పొరేట్ మరియు ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యాను వ్యాపారం చేస్తున్నాయని పాఠశాలలోనే పాఠ్య పుస్తకాలు యూనిఫామ్ సైనిక్ వంటి పేర్లతో అక్రమంగా ఇష్టం వచ్చినట్లు వేల రూపాయలకు వసూలు చేస్తున్నారన్నారు ,ప్రభుత్వ నిబంధనల ను పాటించకుండా అక్రమంగా నడుపుతున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని . అలాగే కడప నగరంలో భగత్ సింగ్ నగర్ లో గల మేధా శ్రీ పాఠశాల ఎలాంటి అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థి తల్లిదండ్రులు నుండి డబ్బు దోచుకోవడానికి ముఖ్య ఉద్దేశంగా కార్పొరేట్ విద్యసంస్థలు ఉన్నాయి, ఇలాగే ఉంటే భవిష్యత్ లో విద్యార్థులు విద్యకు దూరం అయే పరిస్థితులు ఎదురవుతాయని కాబట్టి అలాంటి విద్యా సంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు, ఈ కార్యక్రమాల్లో అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలు పరిష్కరించాలి

**నూతన ప్రభుత్వంలో సాగు సాయం రూ.20,000 అందించాలి**



కమలాపురం మేజర్‌న్యూస్ : నూతనంగా ఏర్పడినటువంటి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నటువంటి రైతాంగ సమస్యలను పరిష్కరించాలని సిపిఐ కమలాపురం నియోజకవర్గ సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు, గురువారం స్థానిక మండల డిప్యూటీ తాసిల్దార్ కి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రైతుకు 20 వేలు ఈ ఖరీఫ్ సీజన్‌లోనే అందించేందుకు కృషి చేయాలన్నారు, పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు వడ్డీలేకుండా 3 లక్షల వరకు పావలా వడ్డీతో 5 లక్షల వరకు ఇవ్వాలని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ చేపట్టి వారికి రుణాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు, రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల క్రింద ఉన్న ప్రధాన కాలువలు, మేజర్, మైనర్ కాలువలతోపాటు డెల్టా ప్రాంతాల్లోని మురుగు నీటి కాలువుల మరమ్మత్తులు వెంటనే చేపట్టి రైతాంగానికి సాగునీరు అందించాలని గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా రైతాంగానికి చెల్లించాల్సిన నిధుల బకాయిల పై శ్వేతపత్రం విడుదల చేయాలని తెలిపారు, గత రబీ కాలంలో ప్రభుత్వం సేకరించిన ధాన్యం బకాయిలను రైతాంగానికి వెంటనే చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని, నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం రైతాంగానికి ఉరితాడుగా తయారైన స్మార్ట్ మీటర్ల ను వెంటనే రద్దు చేయాలని తెలిపారు, శాసనసభా సమావేశాలలో లాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు బిల్లును సభలో ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలని కోరారు, ఖరీఫ్ సాగుకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు, వరి, వేరుశనగ, కంది తదితర విత్తనాలను 90% సబ్సిడీపై ఇచ్చి రైతాంగానికి ఆదుకోవాలని వ్యవసాయానికి అవసరమైన ఎద్దులు, బండ్లు, నాగలి తదితర పనిముట్ల కొనుగోలుపై 50 శాతం సబ్సిడీ తో అందించాలని, ట్రాక్టర్లకు 50 శాతం సబ్సిడీపై డీజిల్ సరఫరా చేయించాలని విజ్ఞప్తి చేశారు. కల్తీ విత్తనాలను అరికట్టి కల్తీ విత్తనాలు అమ్ముతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకొనేలా చట్టంలో మార్పులు తెచ్చి కల్తీ విత్తనాలతో మోసపోతున్న రైతులను ఆదుకోవాలనారు, అటవీ జంతువుల దాడిలో మరణించిన రైతు కుటుంబాలకు 15 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 5లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సేక్షావలి మిద్దె రమణ సుబ్బరాయుడు రాయప్ప తదితరులు పాల్గొన్నారు..

# మదనపల్లెలో సంగీత కళాకారుని ఇంట్లో చోరీ



మదనపల్లె క్రైమ్, మేజర్ న్యూస్ : మదనపల్లె లోని ఓ సంగీత కళాకారుని ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. చోరీకి సంబంధించి మదనపల్లె తాలూకా పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొండా మరి పల్లి పంచాయతీ, టిఎన్ఆర్ కాలనీకి చెందిన సంగీత కళాకారుడు విజయకుమార్ తిరుపతిలో తబలా వాయించడానికి బుధవారం ఉదయం వెళ్ళాడు. ఇంట్లో లేనిది గుర్తించిన దొంగలు తాళాలు పగల గొట్టారు. బీరువా లో ఉన్న రూ.2.5లక్షల నగదు, 3లక్షల విలువైన బంగారు ఆభరణాలను అపహరించుకు వెళ్లారు. గురువారం మదనపల్లి కి వచ్చిన బాధిత సంగీత కళాకారుడు ఇంట్లో చోరీ జరిగినది గుర్తించి వెంటనే మదనపల్లి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై సీఐ శేఖర్ స్పందించి దొంగలు చోరీకి పాల్పడ్డ ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీంతో ఘటనా స్థలానికి వెళ్లి ఆధారాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# హత్య కేసులో నిందితుడు అరెస్ట్



ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్: స్థానిక పట్టణంలోని వైఎంఆర్ కాలనీ నందు సంచలనం సృష్టించిన మహేశ్వర్ రెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రామచంద్రారెడ్డిని అరెస్టు చేసినట్లు ప్రొద్దుటూరు డిఎస్పి మురలీధర్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు. ఈ సందర్భంగా స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో డిఎస్పి మురలీధర్ మాట్లాడుతూ, మహేశ్వర్ రెడ్డి తల్లి అయిన నాగరత్నమ్మ భర్త మరణించడంతో గడచిన 15 సంవత్సరాలుగా రామచంద్రా రెడ్డి ఆమెతో సహజీవనం చేస్తున్నట్లు, కాగా ఇంటర్మీడియట్ ఫెయిల్ అయ్యి జులాయిగా తిరుగుతున్న మహేశ్వర్ రెడ్డిని భారతి సిమెంట్స్ నందు పనికి చేర్పినట్లు, ఈ క్రమంలో మహేశ్వర్ రెడ్డి ప్రతి రోజు మద్యం సేవించి అటు తల్లిని ఇటు తనను చిత్రహింసలకు గురి చేసేవాడని, అలాగే తమ స్వీట్ షాప్ నందు పనికి వచ్చే ఒక మహిళతో అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తుండగా ఇది గమనించిన తాను 23వ తేదీ రాత్రి మందలించగా, తమకు రావలసిన మూడు లక్షల రూపాయల డబ్బు ఇస్తే తాను తన తల్లి ఎటైనా వెళ్లి జీవనం కొనసాగిస్తామని రామచంద్రారెడ్డికి చెప్పినట్లు, అయితే తనను తనతో సహజీవనం చేస్తున్న మహేశ్వర్ రెడ్డి తల్లి అయిన నాగరత్నమ్మ ను ఎక్కడ విడదీస్తాడో అనే సందేహంతో, తల్లి నాగరత్నమ్మ ఇంటిలోని లోపల గదిలో నిద్రిస్తుండగా మృతుడు మహేశ్వర్ రెడ్డి మరియొక గది నందు నిద్రిస్తున్న సమయాన్ని ఆసరాగా చేసుకుని తమ స్వీట్ షాప్ నందు లడ్డు తయారు చేసే రాడ్డుతో నిద్రిస్తున్న మహేశ్వర్ రెడ్డి తలపై గట్టిగా కొట్టగా అక్కడికక్కడే మహేశ్వర్ రెడ్డి మృతి చెందినట్లు, అనంతరం మృతదేహాన్ని మూడు భాగాలుగా చేసి ప్రొద్దుటూరు పట్టణ శివారులోని రాయల్ కౌంటీ వద్ద గల కాలువ నందు పడవేసినట్లు డీఎస్పీ మురళీధర్ వివరించారు. సంచలనం రేపిన ఈ హత్యోదంతాన్ని ఛాలెంజ్ గా తీసుకున్న పోలీసులు టీములుగా ఏర్పడటమే కాకుండా డాగ్ స్క్వాడ్ ను పిలిపించి మృతుడి శరీర భాగాల కోసం అలాగే నిందితుడి కోసం వెతుకులాట ప్రారంభించినట్లు, హత్యకు ఉపయోగించిన ఒక గొడ్డలి అలాగే కత్తిని సీజ్ చేసినట్లు, ఇంటిలోని బీరువా నందు రాడ్ రక్తపు మరకలు గల బట్టలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణలో భాగంగా చెన్నూరు వద్దగల కొండపేట నందు నిందితుడు వారి బంధువుల ఇంటిలో ఉండగా అరెస్టు చేశామని, ఇంకా పలువురు సాక్షులను ఈ కేసు నందు విచారించవలసి ఉంది అని, ముద్దాయికి శిక్ష పడే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలుపుతూ, త్వరితగతిన ముద్దాయిని అరెస్టు చేసిన ప్రొద్దుటూరు పట్టణ సీఐలకు అలాగే రాజుపాలెం పోలీసులకు అభినందనలు తెలుపుతూ, పోలీసుల నైపుణ్యం, చాకచక్యం, ప్రస్తుత టెక్నాలజీతో ఎలాంటి కేసునైనా తాము ఛేదిస్తామని ఆయన భరోసానిస్తూ, నిందితుడిని అరెస్టు చేయటంలో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ, ఎస్ఐ, సిబ్బందిని రివార్డుకు సిఫారసు చేస్తున్నట్లు తెలిపారు.

# 10వ తరగతి విద్యార్థి జస్వంత్ నాయక్ మృతి



సుండుపల్లె మేజర్‌న్యూస్: సుండుపల్లె మండల పరిధిలోని ముడుంపాడు పంచాయతీ పించా లో నివాసం ఉంటున్న మూడే మూనే నాయక్ పశువుల శాఖలో కాంటాక్ట్ ఉద్యోగి మూడే జస్వంత్ నాయక్ (14) మృతి చెందాడు. పోలీసుల వివరాలు మేరకు రాజంపేటలో నవోదయ పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థి జస్వంత్ నాయక్‌ను పాఠశాలకు వెళ్లేందుకు పెద నాన్న రెడీ ఆవు పాఠశాలకు వెల్లాలి అని చెప్పడంతో స్నానం చేసేందుకు ఇంటిదగ్గర నీళ్లు పించ డ్యామ్ దగ్గరికి బుధవారం వెళ్లి స్నానం చేసి వస్తానని చెప్పి వెళ్లిన జస్వంత్ నాయక్ గురువారం శవమై తేలినట్లు తెలిపారు. అమ్మ కువైట్‌లో ఉంటుంది,స్కూలుకు వెళ్లేందుకు ఇష్టం లేక మనస్తాపం చెంది మృతి చెందాడ లేక ప్రమాదవశాస్తూ నీటిలో పడి మృతి చెందాడు అన్న విషయం తెలియాల్సి ఉంది అయితే ఈత రాదని కుటుంబ సభ్యులు తెలిపారు. తండ్రి మునేనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హుస్సేన్ తెలిపారు.

# సబ్సిడీపై 400 బస్తాల డిఏపి మంజూరు



చెన్నూరు మేజర్ న్యూస్ : మండలంలోని రామనపల్లె రైతు భరోసా కేంద్రానికి 2024 ఖరీఫ్ సీజన్ గాను 400 బస్తాలు సబ్సిడీపై రైతులకు మంజూరైనట్లు గురువారం గ్రామ వ్యవసాయ సహాయకులు యు. సునీల్ తెలిపారు. రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ వద్ద ఉన్న పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు మొబైల్ ఫోన్ నెంబర్ తీసుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రతి రైతు తమకు సంబంధించిన పంటలను రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతున్నదని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

# బైక్ యాక్సిడెంట్‌లో చిన్న కుడాల హరినాథ్ మృతి



లింగాల మేజర్‌న్యూస్ : లింగాల మండలంలోని ఇప్పట్ల సమీపాన క్రాసింగ్ వద్ద యాక్సిడెంట్ చిన్న కూడాల గ్రామానికి చెందిన తూర్పుంటి హరినాథ్ (43)చిన్న కుడాల నుండి పులివెందులకు బైక్ లో వెళుతుండగా ప్రమాదవశాత్తు బైకు అదుపుతప్పి యాక్సిడెంట్ జరగగా హరినాథ్ రోడ్డు పక్కన ఉన్న పొలంలోకి ఎగిరి పడగా బైకు వచ్చి అతని మీద పడి హరినాథ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు. హరినాథ్ మృతదేహాన్ని పులివెందుల ఏరియా హాస్పిటల్ తరలించారు.వివరాల్లోకి వెళ్తే తూర్పింటి హరినాథ్ అతనిది వేల్పుల కాగా చిన్న కూడాల గ్రామంలో పెళ్లి చేసుకుని ఇక్కడే ఉండిపోయాడు వారి భార్య తూర్పుంటి గంగాదేవి, వీరికి ఇద్దరు కుమారులు వీరి బంధువులు కేసు నమోదు చేసినట్టు ఎస్సై కృష్ణ తెలిపారు.

# పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించిన ఎంపీడీవో



ఓబులవారిపల్లి మేజర్ న్యూస్ : ఓబులవారిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీవో కుళాయి స్వామి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించడం జరిగింది నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పారిశుద్ధ్యము మరియు త్రాగునీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయడం జరిగింది ముఖ్యంగా ప్రతి గ్రామపంచాయతీ నందు గల ఓ హెచ్ ఆర్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని అదేవిధంగా ట్యాంకులకు పెయింటింగ్ వేయాలని ట్యాంకు పరిసర ప్రాంతాలు కంపచెట్లతో నిండి ఉంటే కంప చెట్లు తొలగించాలని కసువు చెదారం తొలగించాలని ఓ హెచ్ ఆర్ రిపేర్లు ఏమైనా ఉంటే చేయించాలని గ్రామస్తులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని గ్రామపంచాయతీల యందు పారిశుద్ధ్య పనులు తప్పకుండా చేయించాలని ఇంకా పెంచిన పెన్షన్ పంపిణీ 4 వేలు 6 వేలు పై తగు సూచనలు జారీ చేయడమైనది ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.